కథానిక

# కథకోసం వ్యథ!

తెన్నేటి అహల్యాదేవి

రాత్రి పన్నెండు కావచ్చింది. ప్రెస్ ఇంకా పని చేస్తూనేవుంది. ఇక్ష్వాకులనాటి కలం చేత్తో పట్టుకుని ప్రూఫ్ రీడర్, రెండుకోళ్లు దాదాపు విరిగిన కుంటిబల్లమీద తలవాల్చి కునికిపాట్లు పడుతున్నాడు.

తలక్రిందు అక్షరాల తమ లోకంలో మునిగి తేల్తున్నారు కంపోజిటర్లు. సంపాదకుడంటే కుర్చీలో కూలబడి వుండవలసిన ప్రాణి. కాని నేడాయన కుర్చీలో కూర్చొని లేడు. కూర్చొనలేడుకూడాను! చికాకుగా వరండాలో పచార్లు చేస్తున్నాడు అటూ ఇటూ. ఏదో ఆవేదన. గంభీరాలోచన.

రేపు ప్రత్యేక సంచిక వెలువడబోతోంది. మొదటి పుటల్లో వేయవలసిన కథ ఏదో ఇంతవరకు దొరకలేదు. మొదటి కథ అంటే కొంతైనా బాగుండాలి కద! ఏవో రెండు కథలు వచ్చాయి గాని శ్రాద్ధయోగ్యంగా వున్నాయి. ఎలా ఇప్పుడు? ఎక్కణ్ణించి తేవాలి కథ? పోనీ తనే రాస్తే కాని తనా మొదటి కథ రాయాల్సింది! ఉన్నట్టుండి ఊహ తట్టింది.

"కామేశం! ఓ, కామేశం..."అని పిలిచాడు. చడీచప్పుడూ లేకుండావచ్చి ఎదురుగానిలబడ్డాడా కామేశం!

"చూడు. ఒక కథ కావాలి రేపు ఉదయాని కల్లా తయారు కావాలి."అన్నాడు సంపాదకుడు.

"చిత్తం. కాని..." ఏదో అనబోయాడు కామేశం.

"రేపు ఉదయానికల్లా... రెండే పేజీలు చాలు."

"చిత్తం."అంతకన్నా ఏమీఅనలేకపోయాడు.

కామేశం పూర్తిపేరు ఇంటిపేరు ఎవరికీ తెలియదు. అంతా అతన్ని కామేశం అనే అంటూంటారు. కొందరి అభిప్రాయం అతను ఒట్టి పిచ్చివాడని కాని అందులో ఏమీ నిజంలేదు. ఎవరూ చెయ్యని పని కామేశానికి అప్పచెప్తే ఇట్టే ఐపూరుకుంటుంది. కాని ఈ సర్వకార్యదక్షత చేతనే ప్రెస్‌లో అతనికి ఫలానా పని అంటూ నియామకంలేదు. ప్రూఫ్ రీడర్లు అతన్ని మెషీన్ వాడి అసిస్టెంటు అనుకొంటారు. మెషీన్‌వాడు కామేశాన్ని కంపోజిటరనుకుంటాడు. కంపోజిటర్ల విశ్వాసం అతను కేవలం చప్రాసీ అని చప్రాసీలు అప్పుడప్పుడు "బాబూ! ఊపిరాడకుండా చేతి నిండా పనేవుంది. కొంచెం ఈ వుత్తరండబ్బాలో వేసి వస్తారా అయ్యగారిచ్చారు.." అనటంకూడా కద్దు. కామేశం అన్నీ కిమ్మనకుండా చేస్తాడు. ఎప్పుడైనా అతనికి జ్ఞాపకం వస్తూంటుంది తాను మొదట్లో సహాయ సంపాదకుడుగా పిలవబడటం. కాని ఆ స్మృతిని అతడు అట్టేసేపు నిలవనీయడు మనస్సులో. తాను సహాయ సంపాదకుడా? ఎవరితో తాను సహకరించేది? 'సహకార'...అని ఏమైనా అనాలంటే సహకార బ్రహ్మ అనాలి అతణ్ణి. సుఖంలో ఎవ్వడూ ఈశ్వరుణ్ణి స్మరించడు. అలాగే పనులన్నీ సవ్యంగా జరుగుతున్నంత సేపూ కామేశం గొడవ ఎవరికీ పట్టదు.

వళ్లో పుస్తకం వుంది. బుఱ్ఱలో ఏముంది? ఏమీలేదు గందరగోళం మినహాయించి. రెండు పేజీలు మంచి కథ, ప్రత్యేక సంచిక. ఈ మాటలే అతని చెవుల్లో గింగురుమంటున్నాయి. తెల్లవారే సరికి కథ. నిజంగా చిత్రవధ! ఏంరాయాలి?

రొమాన్స్! ప్రేమ అంటే అంటే రొమాంటిక్. ఆ! రొమాంటిక్ కథ అయితే బాగుంటుంది. బాల్యంలో తనూ ప్రేమంటే ఎరుగు. తన వూళ్లో వున్నప్పుడు ఒకసారి రొమాన్సు తనకి చాలా సమీపంగా వచ్చింది. ఆ వూరి తూర్పుదిక్కున ఓ శివాలయం. దాని కానుకొని ఒక తోట ఉండేది. బడినుంచి వస్తూపోతూ తానాతోటని దర్శించే వాడు. ఒక రోజున ఒక అమ్మాయి మామిడి చెట్టు క్రింద, నుంచొని, ఒక పెద్ద మామిడి కాయవంక ఆశాదృష్టులతో చూస్తోంది. కామేశం నిశ్శబ్దంగా పోయి, చెట్టెక్కి ఆ కాయ కోసి క్రిందపడేశాడు

ఆమె కాళ్ళదగ్గిర పడేట్లు. ఆమె ఆ కాయ తీసుకుంటుందేమో ననుకున్నాడు. తీసుకోకపోగా, 'ఇదేమిటి! నా కాయ ఎందుకిలా తుంపిపడేశావు'? అంది ఆమె. "నువ్వు తింటావనీ" అన్నాడు తను ఆశ్చర్యపడుతూ. ఒక జేబులోంచి మొండిచాకు, మరో జేబులోంచి ఒక పొట్లం తీశాడు. 'ఇదుగో ఉప్పుకారం! దీన్లో నంచుకుంటూతిను. ముక్కలు కోసిస్తాను.' అన్నాడు తాను. ఆ పిల్లయథావిధిగా ఆరగించి, 'నాకు తెలియకుండా ఎన్నడూ ఇలా చేయవద్దు ఇంకోసారి ఇలాచేస్తే ఎప్పుడూతినను.' అంది వెళ్ళిపోతూ.

మొదటి దృశ్యం మహాభేషుగ్గావుంది. రెండో దృశ్యం మరీ బాగు...ఒకరోజున మళ్ళీ కలుసుకున్నారు ఇద్దరూ. ఆ పిల్ల తనపేరు చిట్టి అని చెప్పింది. కాని కథలో చిట్టి అంటే ఏం బాగుంటుంది? మంచిపేరుండాలి "రశ్మి" అంటే బాగుంటుంది. కాని ఇది మరీ సంస్కృతంగా వుండే. ప్రణయ కథకు తగిన పేరుగా వుండాలి. 'కిరణ్' అంటే? ఇది జనసామాన్యానికి మరీ అందుబాటులో ఉన్న పేరు. 'మదాలస'అంటే? ఓ! భేషుగ్గా వుంది. మామిడిచెట్టుమీద తనపేరూ ఆమెపేరూ కలిపి చెక్కాడు చాకుతో. చిట్టి...కాదు 'మదాలస' చాలా సంతోషించింది. తనపేరు చిత్రాంగదుడు అంటే బాగుంటుందని మదాలస సూచించింది. "నువ్వు చాలా మంచివాడివి. మనపేర్లు యిక్కడ చెక్కావు. ఈవృక్షరాజాలమీద మనపేర్లు ఆచంద్ర తారార్కం నిల్చిపోతాయ్"అంది తన భుజాలమీద చెయ్యివేసి.

బాగుంది, రెండో దృశ్యం కూడా బాగానే వుంది. పేర్లజత ఎంతబాగా కుదిరిందీ! మదాలస-చిత్రాంగదుడు. కాని చిట్టి వివాహమయింది. అదే మదాలసకు పెళ్ళయింది. ఒక కోళ్ళనుపెంచే ఫారమ్ యజమానిని పెళ్లాడింది. ప్రణయం-దుఃఖాంతం-మదాలసా చిత్రాంగదీయం.

కాని పెళ్ళి అందులో కథానాయిక పెళ్ళి కోళ్ళనుపెంచే గొల్లవాడితోనా? కథానాయిక ఏమిటి? కోళ్ళుపెంచడమేమిటి?

టంగ్...టంగ్.గడియారం పన్నెండుకొట్టింది.

కామేశం లేచాడు. లేచి కుర్చీ గుండ్రంగా తిప్పాడు. ఇంతవరకు అతను ప్రూఫ్‌రీడర్ల ముఖంగా వున్నాడు. ఇప్పుడు పూర్తిగా గోడవేపుతిరిగాడు. ఈ కుర్చీ తిరగడంలో అతని మనస్సు కూడా తిరిగిపోయింది.

ఛీ! వెధవ రొమాన్సు! ఇది యదార్థవాద యుగం. కథా అలాగే ఎందుకు వ్రాయకూడదూ. ఔను. యదార్థవాదం? ప్రొద్దున్నే సాతాళింపు సెనగలు. మధ్యాహ్నం తమదజావ. సాయంత్రం జొన్నరొట్టెలు. తోటకూర పులుసు. అడపాదడపా ఉపవాసం. చెమట, మురికి, పేడకుప్పలు, దోమలు, మలేరియా, న్యుమోనియా. నగ్నంగా చింకి జుత్తుతో బెకబెకలాడే సంతానం! అంతే. యదార్థ వాదంతో ముందుకుసాగుతాం.

మదాలస-మహేంద్ర- వాళ్ళ కోళ్ళఫారం... కోళ్ళకు రోగం తగిలింది. ఒకదానివెంబడి ఒకటి చచ్చిపోవడం మొదలుపెట్టినై. చిన్నచిన్న కోడిపిల్లలు మత్తుగా పడివున్నై. మదాలస గుడ్లు లెక్క-పెడుతూ భవిష్యత్తు ఏవిధంగా వుంటుందో అని ఆలోచిస్తున్నది. మహేంద్రకు ప్రియమైన ఒక కోడి ఉంది. విదేశపు 'లెగ్‌హార్న్'జాతికి చెందింది అది. ఒకనాడు దానికి కూడా మత్తు సోకింది, మధ్యాహ్ననికి తల ఒరగవేసింది. సాయంత్రానికి మెడ వ్రేలాడవేసింది. మహేంద్రుడు చేష్టలుడిగి చూస్తూవుండిపోయాడు. మదాలస కోడిని పెట్టుకుని ఏడ్వసాగింది.

మదాలసా విలాపం.

కామేశం వ్రాసిన కథ...నాయిక కోడికోసం ఏడ్వడం. కాళిదాసు 'అజవిలాపం'గొప్పగా వ్రాశాడంటారు. సరే! ఇంకేం తనది 'కుక్కుట విలాపం.'

కామేశం! నీకు మతిపోయింది. తెలివితక్కువ దద్దమ్మవు. ఒఠ్ఠి గుడ్లగూబవు.

ఫెడీలుమని గడియారం ఒకటి కొట్టింది.

ఏం వ్రాశాడో ఏం వ్రాస్తున్నాడో కామేశానికే తెలియదు. ఎర్రబడిన కళ్ళు, ఆకలి చచ్చిన కడుపు, పనికి ఎదురుతిరుగుతున్న బుర్ర. అనుకునేది-ఆలోచనకి వచ్చిందీ ప్రతీదీ కాగితం మీద రికార్డౌతోంది. కునుకుతీసినప్పుడల్లా బల్లకో గోడకో తాకి నవచైతన్యం పొందుతున్నాడు. దెబ్బకొక ప్లాటు మారుతోంది.

సమకాలీన సమస్యల నెత్తుకోవాలి. ఏమిటీ పాతకాలపు రొమాన్సు-పాడు యదార్థమూనూ. పత్రికల్నిండా కంపనం కల్గించే వార్తలొస్తున్నాయి. గోవా సత్యాగ్రహం... కాల్పులు... పాట్నాలో సమ్మెలు... ఇండోచైనాలో యుద్ధజ్వాలలు... శిఖరాగ్ర సమావేశాలు...

ఆలోచనల్లో మళ్ళీ ఏరుదాటాడు కామేశం. ఈసారి కొంచెం మత్తునిద్రే వచ్చింది. కలగంటున్నాడు—తెల్లవారింది. ఎడిటరుదగ్గరకు పోయినాడు. కథ చూపాడు...ఆయన మండిపడ్డాడు. కథ కాగితం ఆయనచేతిలో రెండైంది, నాలుగైంది, ఎనిమిది...చివరకి చిత్తు కాగితాల బుట్టలోనైనా పారెయ్యలేదా ముక్కలు. హతశుడై ఇంటికి పోయాడు. తలుపు కొట్టాడు. భార్యవచ్చింది. "ఓహో! వచ్చారూ, రాత్రికొంప గుర్తుకు రాలేదు కాబోలు!...ఎక్కడో బాగా భోంచేసి వుంటారు వట్టి పొట్టలతో నిద్రపోయినారు పిల్లలంతా."

ఒరిగి తూలిన కామేశం తల ఠపీమని గోడకు ఢీకొన్నది. ఉలిక్కిపడి లేచాడు పాపం. నిజంగానే తెల్లవార వస్తోంది. తనమీద తనకే జాలి వేసింది.

స్వప్నానికి తరువాయి యదార్థమే. ఇల్లుచేరి కామేశం తలుపుతట్టాడు. మళ్ళీ తట్టాడు. ఎక్కడా చడీచప్పుడూ లేదు. మెట్లమీద చతికిలబడ్డాడు. తనెవరు? ఎక్కడ వున్నాడు? ఎందుకున్నాడు? అని ప్రశ్నించుకున్నాడు వేదాంతిలా. ఎక్కడాలేదు. ఏమీ కాదుతను నిష్కారణంగా ఉన్నాడు ఊరికే. కాని కథ? తెల్లవారుతోంది. ఏమిటీ వ్యథ? అతని హృదయం అవమానంతో నిండిపోయింది. ఛీ! వెధవ బ్రతుకు అనుకున్నాడు. జేబులో చెయ్యిపెట్టిచూస్తే కత్తిలేదు. కాని చేతికి పెన్సిల్ తగిలింది. నిశ్శంకంగా బయటకు తీశాడు. రాజీనామా వ్రాయడం మొదలుపెట్టాడు. ఒక ధర్మసందేహం కలిగింది. ఏ పదవి నుంచి తాను రాజీనామా ఇస్తున్నాడో అతనికి అర్థంకాలేదు. చివరికి 'తన పదవి'కి రాజీనామా వ్రాసి పని వెళ్ళదీశాడు. ఆ కాగితం తీసుకుని ఆఫీసుకు చేరాడు. కాని సంపాదక మహాశయుడు కార్యాలయంలో లేడు.

లేకుకుర్చీ లాక్కొని మోకాళ్ళమీద కూర్చున్నాడు, కిటికీవైపుచూస్తూ. తెలతెలవారుతోంది. ప్రాతఃకాలంలో తేజస్సులేదు.

ఇంతలో కామేశం కొడుకువచ్చాడు. "నాన్నా! అమ్మ పిలుస్తున్నది. రాత్రంతా ఇంటికి రాలేదు? ఫలహారం తయారైంది. రండి"అన్నాడు.

"ఆ! ఏమిటీ?" అన్నాడు కామేశం ఒక్క కేకవేసి.

"మామయ్య బెల్లం పంపిస్తే అమ్మ అప్పచ్చులు చేస్తోంది." అన్నాడు కామేశం కొడుకు. కామేశం ఆలోచనలో పడ్డాడు. అంతలోనే కూతురుకూడా వచ్చింది, చంటివాణ్ణి ఎత్తుకుని.

"నువ్వు ఇంటికి వచ్చేటప్పుడు జీతం తీసుకు రమ్మంది అమ్మ. రేపు నోముకు శనగలు పంచి పెట్టాలిట..." అంది.

మళ్ళీ సమస్యా పరిష్కారంలో పడ్డాడు కామేశం. కొంచెమాలోచించి రాజీనామా కాగితం వెనకకు త్రిప్పి, క్రిందటినెల తనకు రావలసిన జీతానికి దరఖాస్తు వ్రాశాడు.

ఇంతలో సంపాదక మహాశయులు కాఫీయాత్ర ముగించుకుని వచ్చారు. సంతాన పరివేష్టితుడైన కామేశాన్ని చూచి, 'ఇదేమిటి' అన్నారు. కాగితం లాక్కుని రాజీనామా చదివి మళ్ళీ ప్రశ్నించాడు, "ఇదేమిటి?"

"ఏమీలేదండీ! నేను క్రొత్తకథ రాస్తున్నాను, సంపాదకుడు కాగితం తిప్పిచూసి అన్నాడు, "ఇదేమిటి?"

"ఇది నేను వ్రాయబోయే క్రొత్త కథకు పాట్లండి."

సంపాదక మహాశయులకు ఏమనాలో తోచలేదు. "మొత్తానికి నువ్వు కామేశానివే!" అన్నాడు.

కాని అప్పటికే కామేశం వ్రాయడంలో నిమగ్నుడైనాడు.

ప్రత్యేక సంచిక వెలువడింది. మొదటి రచన కామేశందే. కాని అతడు వ్రాసినది కథకాదు. వ్రాయడానికి అతడుపడిన వ్యథ! ★